క్లుప్తంగా

మంత్రిని కలిసిన వార్డు ప్లానింగ్ కార్యదర్శులు



మంత్రి సురేష్‌ను కలిసిన నాయకులు

కాకినాడ సిటీ: తమకు టీపీబీవో ప్రమోషన్స్ కల్పించాలని కోరుతూ వార్డు ప్లానింగ్ కార్యదర్శుల నాయకులు రాష్ట్ర మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను శనివారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు రెగ్యులర్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల ప్రమోషన్ల కోసం పరిశీలించి, తగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా స్పెషల్ చీఫ్ సెక్రటరీని ఆదేశించినట్టు రాష్ట్ర నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు దడాల జగ్గారావు, పిల్లి హరీష్, నవీన్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

అధిక చార్జీలపై ఫిర్యాదు చేయండి : ఆర్‌టీఓ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): దసరా పండగ నేపథ్యంలో కాకినాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి ట్రావెల్స్ నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని కాకినాడ ఆర్‌టీఓ సాయి ప్రసాద్ శనివారం తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, అధిక చార్జీలు వసూలు చేస్తే బస్సు నంబర్, రూట్, ట్రావెల్స్ వివరాలను 91542 94314 నంబరుకు వాట్సాప్ ద్వారా సమాచారమివ్వాలని తెలిపారు.

దాడిలో ఆటో డ్రైవర్ మృతి



సంఘటన స్థలం వద్ద పడిఉన్న ఆటోడ్రైవర్ మృతదేహం

కాకినాడ రూరల్: బైక్‌ను ఢీకొట్టాడన్న కారణంతో మోటార్ సైక్లిస్ట్ చేసిన దాడిలో ఆటోడ్రైవర్ మరణించాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన సయ్యద్ మహమ్మద్ ఆలీ తన భార్యతో కలిసి శనివారం సాయంత్రం మోటార్ బైక్‌పై పిఠాపురం నుంచి సొంత ఊరికి వెళుతున్నాడు. పిఠాపురం–కాకినాడ రోడ్డులో నాగమల్లితోట జంక్షన్ వద్ద ప్రయాణికుల ఆటోతో వెళుతున్న తాళ్లరేవు మండలం సీతారామపురానికి చెందిన మోకా రాజేంద్రప్రసాద్(55) తన వాహనంతో ఢీకొట్టాడు. బైక్‌పై నుంచి ఆలీ భార్య కిందపడిపోయింది. ఆటోను ఆపకుండా రాజేంద్రప్రసాద్ వెళ్లిపోయాడు. దీంతో ఆగ్రహించిన ఆలీ ఆటోను వెంబడించి, జేఎన్‌టీయూకే వద్ద అడ్డుకున్నాడు. ఆటోడ్రైవర్ రాజేంద్రప్రసాద్‌పై దాడికి పాల్పడడంతో, అతడు అక్కడికక్కడే మరణించాడు. సీఐ ఆకుల మురళీకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వయంపాకం పంపిణీ



బ్రాహ్మణులకు స్వయంపాకం అందిస్తున్న సంఘ సభ్యులు

బోట్‌క్లబ్: దసరా సందర్భంగా కాకినాడ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో 30 మంది పేద బ్రాహ్మణులకు స్థానిక చల్లా ఫంక్షన్ హాల్‌లో శనివారం స్వయం పాకం అందించారు. ముఖ్య అతిథి ప్రముఖ ఆడిటర్ ఆదిత్య శర్మ మాట్లాడుతూ సమాజంలో ప్రతి అంశంలోను బ్రాహ్మణుల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. సంఘ కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు సౌజన్యంతో రూ.50 వేల విలువైన బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. సంఘ అధ్యక్షుడు అజ్జరపు సత్యనారాయణ, సభ్యులు అయ్యగారి వెంకటేష్, మాండలిక శాస్త్రి, చల్లా నిరంజన్, రంగాభట్ల శ్రీనివాస్, శ్యామలరావు పాల్గొన్నారు.

హలో.. ప్రభుత్వ పథకాలందుతున్నాయా?

- కాకినాడలో వినూత్నంగా టెలికాలింగ్ సిస్టమ్
- సిటీ ఎమ్మెల్యే ప్రయత్నానికి చక్కని స్పందన
- సమస్యల పరిష్కారంతో ప్రజల ఆనందం

సమస్యలు చెప్పుకోవడానికి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగడం రొటీన్. వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు తమవంతు ప్రయత్నించడం ఇంకా రొటీన్. ఇందుకు భిన్నంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 'టెలికాలింగ్ సిస్టమ్' ద్వారా ప్రజలకే ఫోన్ చేయించి, సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించడమే కాకుండా, పరిష్కారమైన విషయాన్ని తిరిగి ప్రజలకు తెలియజేసే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

కాకినాడ: హలో.. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గారి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అర్హత ఉండి పథకం రావడం లేదా? ఏమైనా స్థానిక సమస్యలున్నాయా? వలంటరీ వ్యవస్థ ఎలా పనిచేస్తోంది? ఇలా ఫోన్ చేసి మరీ సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్న వినూత్న విధానం ప్రజలను ఆకట్టుకుంటోంది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి తన కార్యాలయం వేదికగా 10 మంది సిబ్బందిని నియమించి, టెలికాలింగ్ సిస్టమ్ ద్వారా కాకినాడ నగరంలోని ప్రజలకు ఫోన్ చేయించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. టెలికాలర్ల ద్వారా వచ్చిన సమస్యను తమ వ్యక్తిగత సహాయకులు, కార్యాలయ సిబ్బంది ద్వారా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు పంపించి సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అలాగే ప్రతి సచివాలయ పరిధికి ఒకొక్క వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి, ప్రజలు నేరుగా సమస్యలను చెబితే వాటిని కూడా పరిష్కరించేందుకు మరో వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. ఇలాంటి వినూత్న విధానం ద్వారా ప్రజలకే ఫోన్ చేసి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న తీరుతో జనం హ్యాపీ ఫీలవుతున్నారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా పథకాలను అమలు చేయడంతో పాటు వాటిలోని లోపాలను తెలుసుకుని పరిష్కరిస్తున్న తీరుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పింఛన్లు, చేయూత, అమ్మ ఒడి వంటి ప్రభుత్వ పథకాలతో పాటు స్థానిక సమస్యలైన మంచినీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలకు కూడా మోక్షం లభిస్తోంది. పైగా సమస్య పరిష్కరించాక ఆ ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి మరీ తెలియజేస్తుండడంతో ప్రభుత్వ పరిపాలన విధానంపై హర్షాతిరేకం వ్యక్తమౌతోంది.



ఎమ్మెల్యే ద్వారంపూడి కార్యాలయంలో టెలికాలింగ్ సిస్టమ్ ద్వారా మాట్లాడుతున్న సిబ్బంది

సీఎం వల్లే ధైర్యంగా ప్రజల్లోకి..



ప్రజా సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి ఉండడం వల్లే ఇలాంటి వినూత్న కార్యక్రమాలను సక్సెస్‌ఫుల్‌గా అమలు చేయగలుగుతున్నాం. సమస్య ఏదైనా పరిష్కరించగలమనే ధైర్యాన్ని సీఎం ఇచ్చారు. అందువల్లే టెలికాలింగ్ సిస్టమ్ వంటి విధానాలతో ప్రజలతో ఫోన్ల ద్వారా, గడపగడపకూ ప్రభుత్వం వంటి కార్యక్రమాల ద్వారా స్వయంగా ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుని, పరిష్కరిస్తున్నాం. అందుకే ఇలాంటి ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాం. – ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే

ప్రజాస్పందన ఎంతో బాగుంది



టెలికాలింగ్ సిస్టమ్ ద్వారా ఫోన్ చేసి సమస్యలు అడుగుతున్నప్పుడు ప్రజలు తొలుత ఆశ్చర్యపోతున్నారు. తర్వాత మేమే ఫోన్ చేసి సమస్య పరిష్కారమైందని తెలియజేసినప్పుడు మరెంతో సంతోషిస్తున్నారు. ఫోన్ చేసి సమస్యలను అడుగుతున్న సమయంలో ప్రజలు కూడా బాగా రిసీవ్ చేసుకుని పథకాల అమలులో ఎదురయ్యే ఇబ్బందులు, స్థానిక సమస్యలను వివరిస్తున్నారు. ఈ విధానం మంచి ఫలితాన్నే ఇస్తోంది. – డి.ప్రేమకుమారి, టెలికాలర్, కాకినాడ


ఒక్క ఫోన్‌తో సమస్య పరిష్కారం



చేదోడు పథకం ద్వారా నిధుల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నా. సాంకేతిక కారణాలతో నగదు పడలేదు. అదే సమయంలో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డిగారి కార్యాలయం నుంచి ఫోన్ చేసి, సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడగడంతో వెంటనే ఈ విషయం వివరించాను. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో చేదోడు పథకానికి సంబంధించిన నిధులు అందాయి. – దుద్దిపూడి జయలక్ష్మి, లబ్ధిదారు, కాకినాడ

ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు చేరువ కావాలి

కమిషనర్ నాగనరసింహారావు



కాకినాడ: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తోన్న సేవలు ప్రజలందరికీ చేరువయ్యేలా ప్రజారోగ్య సిబ్బంది దృష్టి పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీలో ఈ అంశంపై ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలతో శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క గృహయజమాని ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా కృషి చేయాలన్నారు. దీనివల్ల ఆరోగ్యశ్రీ సేవలు అందించే సమీపంలో ఉన్న ఆస్పత్రుల వివరాలు, అక్కడ లభించే వైద్యసేవల సమాచారం తెలుస్తోందన్నారు. ఆ యాప్‌ను వినియోగించుకునే విధానంపై వలంటీర్లు ప్రతి ఇంటికెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు 75 వేల కుటుంబాలు డౌన్‌లోడ్ చేసుకోవలసి ఉందని, ఇప్పటి వరకు సుమారు 14 వేల మంది మాత్రమే యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు.

ఈ దేశంలో పుట్టడం గొప్ప అదృష్టం



సర్పవరం జంక్షన్‌లో అమృత్ కలశ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీడీఓ స్వప్న తదితరులు

- అమృత్ కలశ యాత్రలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మనిషిగా ఈ దేశంలో పుట్టడం గొప్ప అదృష్టమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. 'నా మట్టి నా దేశం' కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన మట్టిని ఢిల్లీ పంపేందుకు శనివారం నెహ్రూ యువకేంద్ర, మండల పరిషత్ సంయుక్తాధ్వర్యంలో అమృత్ కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కె.స్వప్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తొలుత ఎమ్మెల్యే కన్నబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఇతర దేశాల్లో పలు వాతావరణ సమస్యలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని, మన దేశంలో ప్రశాంత వాతావరణం ఉంటుందని వివరించారు. వేలాది సంవత్సరాల క్రితం ప్రపంచానికి జీవన విధానం నేర్పినది భారతదేశమని, దేశం పట్ల ప్రేమతో ఉండాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఏడున్నర దశాబ్దాల్లో ముందుతరాల వారు అనేక కరువు కాటకాలు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మనది మోడల్‌గా నిలుస్తుందన్నారు. చంద్రయాన్ విజయంతో ప్రపంచంలో ఎనలేని ఘనత సాధించామని కొనియాడారు. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ చాలా దేశాల్లో మన వారు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికోద్యోగులకు సన్మానం చేశారు. అనంతరం కలశంలో మట్టిని సేకరించి, ప్రతిజ్ఞ అనంతరం కలశ యాత్రను సర్పవరం జంక్షన్ వరకూ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, నెహ్రూ యువకేంద్ర ప్రతినిధి సూర్య, సర్పంచ్‌లు రామదేవు చిన్నా, శీలం చిన్నా, తమ్మవరం సర్పంచ్ గొల్లపల్లి రాంబాబు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, పుల్ల కోటేశ్వరరావు, ఎంతఊలు గణేష్‌బాబు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలకు కేడర్ సమాయత్తం కండి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి .. హాజరైన నాయకులు, కార్యకర్తలు

- సీఎం జగన్ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి
- టీడీపీ, జనసేన దుష్ప్రచారాలను తిప్పికొట్టండి
- వైఎస్సార్ సీపీ సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: త్వరలో జరగనున్న ఎన్నికలకు వైఎస్సార్ సీపీ కేడర్ ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చిన విధానాన్ని ప్రజలకు వివరించడంతో పాటు టీడీపీ, జనసేన చేస్తోన్న దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో జగన్నాథపురం ప్రాంత కన్వీనర్లు, గృహసారథుల విస్తృత సమావేశం శనివారం జరిగింది. పార్టీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ 1 నుంచి నెల రోజుల పాటు జరిగే పార్టీ కార్యాచరణను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యే వివరించారు. ఎన్నికలకు ముందు సీఎం జగన్ అనేక హామీలు ఇచ్చి 99 శాతం అమలు చేశారని, అదే చంద్రబాబు 2014–2019 మధ్య ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా, మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని నిర్దేశించారు. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సచివాలయాల వారీగా ప్రభుత్వ పథకాల లబ్ధిని బోర్డుల రూపంలో ప్రదర్శించడం, స్థానికంగా పార్టీ పతాకాలను ఆవిష్కరించడం, ఇంటింటికెళ్లి, ప్రజలతో మమేకమై గత, ప్రస్తుత ప్రభుత్వాల పాలనా విధానాలను ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. దేశంలో అమ్మఒడి వంటి పథకం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అమలవుతోందని, అనేక పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్న వైనాన్ని అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. ప్రజల ఆమోదంతో ప్రతి ఇంటా వైఎస్సార్ సీపీ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రానున్న మూడు, నాలుగు నెలలు పార్టీకి అత్యంత కీలకమని, ఈ విషయంలో గృహసారథులు, కన్వీనర్లు, ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే అంశాన్ని అత్యంత ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కొడ మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, గృహసారథులు, కన్వీనర్లు సమావేశానికి హాజరయ్యారు.

ఆర్థికాభివృద్ధి దిశగా మత్స్యకార మహిళలు

- డ్రై ఫిష్ యూనిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబు



డ్రై ఫిష్ యూనిట్‌లో చేపలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: అవకాశాలను అందిపుచ్చుకుంటూ మత్స్యకార మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఇందుకు రాష్ట్రప్రభుత్వం తోడ్పడుతుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఉప్పలంక శివారు మొండిలో శనివారం ట్రైనీ కలెక్టర్ ప్రకార్ జైన్ ప్రోద్బలంతో మహిళాశక్తి సంఘాల సభ్యులు నెలకొల్పిన డ్రై ఫిష్ యూనిట్ (సాంకేతిక పద్ధతిలో ఎండుచేపలు, ఇతర మత్స్య ఆధారిత ఉత్పత్తుల తయారీ కేంద్రం) ను ఆయన ప్రారంభించారు. మహిళా శక్తిని పెంపొందించడం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారం ఎల్లవేళలా ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వేటాడిన చేపలను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే, ఆ మత్స్య సంపదతో తయారుచేసిన ఉత్పత్తుల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. అందుకే మొండిలో 40 మంది మహిళాశక్తి సంఘాల సభ్యులలో తొలివిడతగా 15 మందికి విశాఖపట్నంలోని సీఐఎఫ్‌టీలో రాష్ట్ర కోఆర్డినేటర్ పి.హనుమంతరావు శిక్షణ ఇచ్చారన్నారు. చేపల నిల్వ, వాటితో వివిధ వంటకాల తయారీ, మార్కెటింగ్‌లో శిక్షణ ఇచ్చినట్టు వివరించారు. భవిష్యత్తులో మరింత మందికి శిక్షణ ఇచ్చి, చేపల ఉత్పత్తుల ఔట్‌లెట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ రమణి మాట్లాడుతూ మొండిలో ట్రయల్ ప్రాజెక్టును ఏర్పాటు చేశామని, సత్ఫలితాలు సాధించి, మరిన్ని డ్రై ఫిష్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీ కాలాడి కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి, ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, సెర్ప్ డైరెక్టర్ మహిత, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ఆరోగ్యానికే సురక్ష

- ఎమ్మెల్యే కన్నబాబు



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: రాష్ట్రంలోని ప్రతి ఇల్లు ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని ఉప్పలంకలో శనివారం సర్పంచ్ బొమ్మిడి నయోమి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. రాష్ట్రంలో 1.60 కోట్ల గృహాలుండగా, ప్రతి ఇంటినీ సర్వే చేసి, వైద్య సేవలందిస్తున్నట్టు కన్నబాబు వివరించారు. కార్పొరేట్ వైద్యం కూడా అందిస్తారన్నారు. గ్రామంలో ఎక్కువగా చర్మవ్యాధులు, చెవుల సమస్యలను గుర్తించారని, వారికీ వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పలంక, మొండి గ్రామాల నుంచి 335 మంది ఈ శిబిరంలో నమోదు చేసుకున్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ పి.ఆశ వైద్య సేవలందించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కిట్లను రోగులకు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే కన్నబాబు బీపీ పరీక్షించుకున్నారు. శిబిరాన్ని పరిశీలించి, ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీ కాలాడి కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సాయి పుణ్యతిథి ఉత్సవాలు

బోట్‌క్లబ్: భానుగుడి రిజర్వు పోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న సాయిబాబా ఆలయంలో ఈ నెల 23 నుంచి 26 వరకూ సాయి పుణ్యతిథి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ పర్సన్‌ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ శనివారం విలేకర్లకు తెలిపారు. ప్రతిరోజూ స్వామికి దివ్యహారతులు, మంగళస్నానాలు, సహస్ర నామార్చన, పల్లకీసేవ, సామూహిక నామస్మరణఉంటాయన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

కాకినాడ సిటీ: దేశంలో మత సామరస్యాన్ని కాపాడడమే అమరవీరులకు నిజమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. వీరతెలంగాణ రైతాంగం సాయుధ పోరాట అమరుడు తోరాటి లక్ష్మణమూర్తి, ఆదర్శ కమ్యూనిస్టు ఇనుగంటి రామతులసమ్మ వర్ధంతుల సందర్భంగా పార్టీ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో వారి సంస్మరణ సభ జరిగింది. పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. దేశంలో అల్లర్లు, కొట్లాటల వల్ల దేశాభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోందన్నారు. సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి, కె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టర్ ధాత్రికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కాకినాడకు చెందిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి ధాత్రిని ది సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కాకినాడ హ్యాలోకస్ టైమ్స్ క్లబ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ముత్తా నవీన్‌కృష్ణ ఆమెను ఘనంగా సత్కరించి, రూ.15,500 ఆర్థికసాయం అందించారు. ఆయన మాట్లాడు తూ ధాత్రి ఇప్పటివరకూ రాష్ట్రం తరఫున 26 జాతీయ పోటీల్లో పా ల్గొని, 16 మెడల్స్ సాధించడం కాకినాడకు గర్వకారణమన్నారు. ధాత్రికి శిక్షణఇచ్చిన డీఎస్‌ఏ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్‌ను అభినందించారు. ధాత్రికి సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ తరఫున ప్రోత్సాహం అందిస్తామన్నారు. కమిటీ కో–ఆర్డినేటర్ కె.పద్మనాభం మాట్లాడుతూ ఏషియన్ గేమ్స్‌లో పతకాలు పొందిన రాష్ట్ర క్రీడాకారులకు రూ.4 కోట్లు ప్రభుత్వం పారితోషికంగా అందించడం హర్షణీయమన్నారు. ధాత్రికి వి.శేషగిరి, శ్రీలక్ష్మి, షాహిదా, డీవీ వరలక్ష్మి, గిరిజ ఈ మొత్తాన్ని సమకూర్చారని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో ధాత్రి రాణించాలని ఆకాంక్షించారు. కమిటీ అధ్యక్షుడు ఎంఏ ధీన్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ధాత్రి తండ్రి వీరబాబు పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కనకదుర్గ అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు



రక్తబీజాక్షుని వధ అవతారంలో పర్వత వర్ధినీదేవి



బాలత్రిపుర సుందరి ఆలయంలో రక్తబీజాక్షుని వధ అలంకరణలో..



భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు

కరప: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కరప, పేపకాయలపాలెం, పెనుగుదురు, నడకుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, యండమూరు, వేళంగి, వేములవాడ, వలసపాకల, కొరుపల్లి, అరట్లకట్ట, వాకాడ, కూరాడ తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధర్ అమ్మవారికి పూజాదికాలు నిర్వహించగా, వేదపండితులు కుంకుమార్చనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కరపలోని విశ్వాలయంలో ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వతవర్ధినీదేవిని రక్తబీజాక్షుని వధ అవతారంలో అలంకరించారు. కరప మార్కెట్ యార్డు వద్ద దుర్గాదేవిని భక్తులు దర్శించుకున్నారు.

శ్రీపీఠంలో అమ్మవారికి కనకదుర్గ అలంకరణ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు కనకదుర్గ అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు.

అమ్మవారికి విశేష పూజలు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారిని రక్తబీజాక్షుని వధలో అలంకరించారు. కీర్తనలు, వయోలిన్ కచేరి, కోలాటం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కనకదుర్గ అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో, రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో, విద్యుత్‌నగర్‌లో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో జరిగిన చండీహోమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు పాల్గొన్నారు.

